
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### కరెంటు కోతలకు కేరాఫ్ కాంగ్రెస్

కాంగ్రెస్ హయాంలో కరెంటు కష్టాలను ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నాం. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు కరెంటు ఎప్పుడు వచ్చేదో, ఎప్పుడు పోయేదో తెలిసేది కాదు. కాంగ్రెస్ పార్టీ కరెంటు కోతలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. వారి హయాంలో రాత్రిపూట పొలాల వద్ద కాపలా ఉండి మరీ పొలాలు పారించాల్సి వచ్చేది. ఈ సమయంలో పాములు, తేళ్ల కాటుకు గురై మరణించిన రైతులు ఎంతోమంది ఉన్నారు. అలాంటిది స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో గత పదేండ్లుగా నాణ్యమైన 24 గంటల ఉచిత కరెంటుతో ఏ ఇబ్బంది లేకుండా పంటలు పండించుకుంటున్నాం. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందిస్తుండడంతో వ్యవసాయాన్ని పండుగలా చేస్తున్నాం. మర్చిపోయి కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ ఎనుకటి రోజులే వస్తాయి. రైతును రాజు చేస్తున్న సీఎం కేసీఆర్ వెంటే రైతాంగమంతా ఉంటాం.

–కంసాని నర్సింహ, రైతు, తాతానగర్, భువనగిరి



మూడు గంటల విద్యుత్‌పై మండిపడుతున్న రైతన్న

24 గంటలు సరఫరా చేసే సర్కారు కావాలంటున్న అన్నదాతలు







# కాంగ్రెస్ వద్దు.. కరెంట్ కావాలె

### 24 గంటల కరెంటు ఎత్తివేసే కుట్ర

3 గంటల కరెంటు అని ఒకరు.. 5 గంటలని ఇంకొకరు.. 10 హెచ్‌పీ మోటర్ అని మరొకరు.. ఇలా పూటకోమాట మాట్లాడి రైతులను ఆగం పట్టించేందుకు కాంగ్రెసోళ్లు కుట్ర చేస్తున్నరు. అసలు కాంగ్రెస్ నాయకులది ఎవుసం చేసిన ముఖమేనా..? ఎవరికి వారు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇస్తున్న 24 గంటల ఉచిత కరెంట్ ఎత్తివేసే కుట్ర చేస్తున్నరు. గతంలో కాంగ్రెస్ పాలనలో పడ్డ కష్టాలను మేము ఇంకా మరిచిపోలేదు. రాత్రిపూట కరెంట్ కోసం బావులకాడికి పోయి ఎందరో చనిపోయింఢ్రు. ఎవుసం నడువక వలసపోయింఢ్రు. జీవితాలు ఆగమైనయ్. మళ్లీ ఇప్పుడిప్పుడే కేసీఆర్ ప్రభుత్వంలో మంచిగ బతుకుతున్నం. 24 గంటల కరెంట్‌తో రంది లేకుండా పంటలు పండించుకుంటున్నం. ఇప్పుడు కాంగ్రెసోళ్లు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నరు. వాళ్ల నాటకాలకు రైతులంతా కలిసి చెక్ పెట్టాల్సిన తరుణం ఆసన్నమైంది.

–జల్లి నరసింహులు, రైతు, ఆలేరు

### కాంగ్రెస్ వస్తే కరువు కాటకాలే..

స్వరాష్ట్రంలో 24 గంటల నిరంతర విద్యుత్‌తో పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. ఎక్కడ కరువు, కాటకాలు లేకుండా రైతులు సంతోషంగా ఉన్నారు. ఈ సమయంలో కాంగ్రెస్ కుతంత్రాలతో కూడిన రాజకీయాలు చేయాలని చూస్తున్నది. వ్యవసాయానికి 3గంటల కరెంటు చాలని, రైతులు 10హెచ్‌పీ మోటర్లు వాడాలని ఆ పార్టీ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నరు. 3 గంటలు కరెంటు వ్యవసాయానికి ఎలా సరిపోతుందో రేవంత్‌రెడ్డి చెప్పాలి. వచ్చీరాని మాటలు మాట్లాడుతూ రైతులకు అన్యాయం చేయాలని చూస్తున్న కాంగ్రెస్‌ను తరిమికొడతం. వచ్చే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి బుద్ధి చెబుతాం. రైతుల పాలిట దేవుడు సీఎం కేసీఆర్‌కు మద్దతు పలుకుతాం.

–రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రైతు, నాగిరెడ్డిపల్లి, భువనగిరి కలెక్టరేట్



> కల్లబొల్లి మాటలు చెప్పే కాంగ్రెస్ వద్దు.. 24 గంటల నాణ్యమైన కరెంటు ఇచ్చే సర్కారు కావాలని రైతన్నలు చెప్తున్నారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలు.. 10హెచ్‌పీ మోటర్లు వాడాలంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులపై అన్నదాతలు మండిపడుతున్నారు. మూడు గంటల కరెంట్‌తో ఒక్క మూలైనా తడుస్తదా? అని ప్రశ్నిస్తున్నారు. అసలు వ్యవసాయం గురించి తెలుసా.. మూడు గంటల కరెంటు ఇస్తే సాగు బంద్ చేయాల్సి వస్తదని ఆందోళన చెందుతున్నారు. గతంలో పంటలు పండించడానికి అష్టకష్టాలు పడ్డామని, ఇప్పుడు నిరంతర విద్యుత్‌తో నిమ్మలంగా ఉన్నామని చెప్తున్నారు. మళ్లీ కాంగ్రెస్ పాలన తెచ్చి తమ బతుకును ఆగం చేయొద్దని కోరుతున్నారు.

### కాంగ్రెస్ మాట వింటే రైతులు కూలీలు కావాల్సిందే..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు మళ్లీ వలసలు తప్పవు. రైతులు వ్యవసాయం చేసుడు కష్టమే. ఇప్పుడున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24గంటల కరెంట్‌తో పంటలు మంచిగా పండుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాత్రి పూట బావుల వద్ద కరెంట్ కోసం ఎదురుచూసేవాళ్లం. 10హెచ్‌పీ మోటర్లు పెట్టి వ్యవసాయం చేయడం సాధ్యమయ్యే పనికాదు. రేవంత్‌రెడ్డికి రైతుల కష్టాలు తెలియవు. 3 గంటల విద్యుత్ అంటున్న కాంగ్రెసోళ్లు పొలాలకు వెళ్లి చూస్తే రైతుల బాధ తెలుస్తది. గతంలో కాంగ్రెస్ పాలనలో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. వచ్చిపోయే విద్యుత్‌తో ఒక్క మడి కూడా పారేది కాదు. సింగిల్ ఫేజ్ కరెంటుతో మోటర్లు కాలిపోయేవి. పొరపాటున కాంగ్రెస్ గనుక అధికారంలోకి వస్తే రైతులు కూలికి వెళ్లాల్సిందే.



–బండ రమేశ్, రైతు, పటేల్‌గూడెం, ఆలేరు రూరల్

### కాంగ్రెస్ వస్తే రైతుల నోట్లో మట్టే

కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో రైతుల బాధలు తెలిసిన కేసీఆర్ ముఖ్యమంత్రి అయినంక వ్యవసాయానికి రంది లేకుండా పోయింది. నాణ్యమైన 24 గంటల కరెంట్ ఇస్తున్నరు. సాగునీళ్లు కూడా పుష్కలంగా ఉన్నాయి. గత కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. రోజు మొత్తంలో 3 నుంచి 4 గంటలు మాత్రమే వచ్చేది. అది కూడా లోఓల్టేజీ కావడంతో మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలి వేసిన పంటఎండిపోయేది. ఇప్పుడు ఆ రంది లేకుండా నాటుపెట్టిన పొలమంతా పారుతుంది. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు రైతులకు 3 గంటల కరెంట్ సరిపోతదంటున్నారు. ఇలాంటి పార్టీకి ఓట్లు వేసి కష్టాలు కొనితెచ్చుకోలేం. కర్మగాలి కాంగ్రెస్ వస్తే రైతు నోట్లో మట్టిగొట్టడం ఖాయం. రైతులంతా అప్రమత్తంగా ఉండి 24గంటల కరెంటు ఇస్తున్న సీఎం కేసీఆర్‌కు మద్దతు పలుకుదాం.



–గుగులోతు రాంజీ, బద్దుతండా, తుర్కపల్లి

### 3గంటలతో ఎకరం కూడా పారదు

తాము అధికారంలోకి వస్తే 3 గంటల కరెంటే ఇస్తాం.. 10హెచ్‌పీ మోటర్లు వాడాలంటూ.. సోయిలేని మాటలు మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులకు వచ్చే ఎన్నికల్లో దిమ్మతిరిగే షాక్ ఇస్తాం. వ్యవసాయంపై వారికి ఏమాత్రం అవగాహన లేకుండా ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నరు. అసలు ఎవరైనా వ్యవసాయానికి 10హెచ్‌పీ మోటర్లు వాడుతారా? 3 గంటల కరెంట్‌తో ఎకరం పొలం కూడా పారదు. 24 గంటల కరెంటుతోనే రైతులకు లాభం జరుగుతుంది. రైతులు తమకు వీలున్న సమయంలో పొలం పారించుకుంటారు. రైతులను రాజు చేయాలనుకుంటున్న సీఎం కేసీఆర్ వెంటే ప్రజలంతా ఉండాలి.



–మామిడి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, మోదుగుకుంట, ఆత్మకూరు(ఎం)

### కాంగ్రెస్ పాలనంటేనే భయం


కాంగ్రెస్ హయాంలో కరెంటు ఎప్పుడు వచ్చేదో, ఎప్పుడో పోయేదో తెలిసేది కాదు. కరెంటు కోసం ఎప్పుడూ బావి దగ్గరే పడిగాపులు కాసేవాళ్లం. వచ్చే కరెంటు కూడా నాణ్యంగా ఉండకపోయేది. లోవోల్టేజీ కరెంటు దీపాన్ని తలపించేది. వచ్చీరాని కరెంటుతో ఒకేసారి మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లపై లోడు పడి కాలిపోయేవి. తిరిగి ట్రాన్స్‌ఫార్మర్లను బాగు చేసేసరికి పొలాలు ఎండిపోయేవి. ఇలా నిత్యం కరెంటు సమస్యలతో ఇబ్బంది పడేవాళ్లం. కాంగ్రెస్ పాలనంటేనే భయంగా ఉండేది. ఇప్పుడు తెలంగాణ వచ్చినాక సీఎం కేసీఆర్ పాలనలో కరెంటు విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉన్నాం. మంచిగా పంటలు పండించుకుంటున్నాం. అలాంటిది తాము అధికారంలోకి వస్తే 3 గంటల కరెంటు ఇస్తామని, రైతులు 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలనడం ఏ మాత్రం సరికాదు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్న కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతాం.



–బండ్ల చంద్రయ్యయాదవ్, రైతు, చిన్నకొండూరు, చౌటుప్పల్

ధరణి తీసేస్తే మళ్లీ దళారుల రాజ్యం వస్తది. పటేల్, పట్వారీల వ్యవస్థతో ఇబ్బందులు పడాలె. వీటిని మేము అంగీకరించం. అంటూ రైతులు ముక్తకంఠంతో చెబుతున్నరు. ధరణి పోర్టల్‌తో భూ సమస్యలు తీరిపోయి.. రైతులు సంతోషంగా ఉండడం నచ్చని కాంగ్రెస్ ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని కుట్రలు చేస్తున్నది. పాత పటేల్, పట్వారీ వ్యవస్థను తీసుకొస్తమంటూ డ్రామాలు ఆడుతున్నది. ధరణి పోతే దళారులు, పైరవీకారుల రాజ్యం పుట్టుకొస్తుంది. లంచావతారులు వస్తరు. ఏ చిన్నపనికైనా అధికారులు తమ చుట్టూ ఏండ్ల తరబడి తిప్పుకుంటరు. పైసలు ముట్టజెప్పందే ఫైలు ముందుకు కదలదు. భూ రికార్డులు మారుతయ్. భూ దందాలు, సెటిల్మెంట్లకు తెరలేసి గొడవలు, ఘర్షణలకు అవకాశం ఏర్పడుతుంది. అందుకే కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై రైతులు భగ్గుమంటున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెబుతామని స్పష్టం చేస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ)





# ధరణి పోతే ధైర్యం చెడ్డట్టే..

### లంచాలకు ఆజ్యం పోసినట్లే..

సీఎం కేసీఆర్ ధరణి తీసుకురావడంతోనే భూములకు భద్రత కలిగి రైతులంతా ప్రశాంతంగా ఉన్నారు. నేడు కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తామంటూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ధరణిని తీసేస్తే పట్వారి వ్యవస్థ మళ్లీ వస్తుంది. భూములకు భద్రత లేకుండా పోతుంది. ఎవరి భూములు ఎవరి పేరు మీద రాస్తారో తెలియని పరిస్థితి వస్తుంది. రికార్డులను సవరించుకునేందుకు తాసీల్దార్ కార్యాలయం, పట్వారీల చుట్టూ తిరగాల్సి వస్తుంది. లంచం ఇవ్వాల్సి వస్తుంది. అయినా పని అయ్యేది నమ్మకం తక్కువ. అలాంటి పరిస్థితి మాకు వద్దు. భూములకు భద్రత కల్పించిన బీఆర్‌ఎస్ వెంటే ఉంటాం. కాంగ్రెస్‌కు ఎట్టి పరిస్థితుల్లో ఓటేయం.

–బానోతు రాంచందర్, మోతీరాంతండా, తుర్కపల్లి



### మళ్లీ గొడవలు.. కేసులు

ధరణి పోర్టల్‌తో రెవెన్యూ రికార్డులు భద్రంగా ఉన్నాయి. గతంలో పటేల్, పట్వారీ వ్యవస్థ ఉన్నప్పుడు ఒకరి భూములను మరొకరికి రాసేవారు. దాంతో వారి మధ్య గొడవలు, కేసులు అయ్యేవి. ధరణి వచ్చాక అలాంటి సమస్యలు ఏమీ లేవు. ఎవరి భూమి వారి పేరుపై భద్రంగా ఉంది. ఒక వ్యక్తికి ఒకే పాస్ పుస్తకం ఇచ్చారు. రిజిస్ట్రేషన్లు కూడా సులువుగా అవుతున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెసోళ్లు మాట్లాడుతున్న మాటలు రైతుల్లో గుబులు లేపుతున్నాయి. తాము అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామంటున్నారు. ధరణి రద్దుతో మళ్లీ గొడవలకు ఆజ్యం పోసినట్లే. ధరణిని రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్‌నే రద్దు చేసేందుకు రైతులమంతా సీఎం కేసీఆర్‌కు అండగా ఉంటాం.

–నరుకుడుబిందెల సైదులు, రైతు, కొరటికల్, ఆత్మకూరు(ఎం)



### దోచుకునేందుకే ధరణి రద్దు..

ధరణి పోర్టల్ రాక ముందు భూ రికార్డులు ఆగమాగం ఉండేవి. భూ సమస్యల పరిష్కారం కోసం తాసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి అధికారులను ప్రాధేయపడాల్సి వచ్చేది. 12 ఏండ్ల క్రితం మా నాన్న పేరున ఉన్న భూమిని మా అన్నదమ్ములమంతా పట్టా చేసుకున్నాం. పట్టా అయిన తరువాత మ్యుటేషన్ కోసం రెవెన్యూ అధికారులు ఎన్నో ఇబ్బందులు పెట్టింఢ్రు. ఆఫీస్ చుట్టూ తిప్పించుకుంఢ్రు. నెలల తర్వాత రికార్డులకు ఎక్కించారు. నా లాంటి పేదలకు ఇలాంటి కష్టాలు ఉండొద్దనే సీఎం కేసీఆర్ సార్ ధరణి తీసుకొచ్చిండు. ధరణితో రైతుల సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇప్పుడు రైతులు ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ సమయంలో కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామంటుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ధరణి రద్దు చేసి మళ్లీ దోచుకుందామనేది కాంగ్రెస్ నాయకుల ప్రయత్నం. అందుకే ధరణిని రద్దు చేస్తామంటున్నారు. వారి ఆటలు సాగకుండా రైతులంతా సీఎం కేసీఆర్‌కు మద్దతివ్వాలి.



–వర్తియా బిచ్చానాయక్, తిమ్మాపురం, బొమ్మలరామారం

### ధరణి వద్దంటే దరిద్రం కొనితెచ్చుకున్నట్టే

ధరణి రాకముందు భూమి అమ్ముదామన్నా, కొందామన్నా తీవ్ర ఇబ్బందులు ఉండేవి. ధరణి వచ్చాక అలాంటి సమస్యలు లేకుండా పోయాయి. భూమి అమ్మినా, కొన్నా నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. నాడు నెలల తరబడి తిరిగినా పాస్ పుస్తకాలు వచ్చేవి కావు. నేడు రిజిస్ట్రేషన్ అయిన వారం, పది రోజుల్లోనే పక్కా సమాచారంతో పట్టాదారు పాస్ పుస్తకాలు వస్తున్నాయి. భూముల విషయంలో ఎంతో పకడ్బందీగా ఉన్న ధరణిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని ఆ పార్టీ నాయకులు చెప్పడం దరిద్రాన్ని కొని తెచ్చుకున్నట్లే. ధరణి తీసేస్తామనే కాంగ్రెస్‌కు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి. కేసీఆర్ ఉంటేనే ధరణి ఉంటుంది. రైతులమంతా కేసీఆర్‌నే గెలిపిద్దాం.

–నాతి మల్లయ్య, రైతు, రాయిపల్లి, ఆత్మకూరు(ఎం)

### దళారులు రాజ్యమేలుతరు..

నాకు నాలుగు ఎకరాల భూమి ఉన్నది. నాకు తెలివి వచ్చినప్పటి నుంచి భూమినే నమ్ముకుని బతుకుతున్నా. ధరణి రాకముందు అధికారులు ఏదో ఒక సమస్య సృష్టించేవారు. దాని పరిష్కారం కోసం పెద్దమనుషుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ధరణి వచ్చిన తరువాత అలాంటి ఇబ్బందులు లేవు. రైతులందరికీ ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంది. చిన్న చిన్న సమస్యలు ఉన్నంత మాత్రాన ధరణిని రద్దు చేయాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ నాయకులు మతిలేక మాట్లాడుతున్నరు. ధరణి తీసేస్తే దళారులు రాజ్యమేలుతరు. గతంలో కాంగ్రెస్ పాలనలో భూ రికార్డుల వ్యవస్థ అధ్వానంగా ఉండేది. దాన్ని నేడు సీఎం కేసీఆర్ ఓ కొలిక్కి తీసుకొచ్చి భూ సమస్యలన్నింటినీ పరిష్కరించారు. ధరణి తీసేస్తామంటున్న కాంగ్రెస్ నాయకులకు వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతాం.

–పాక లక్ష్మయ్యయాదవ్, రైతు, చిన్నకొండూరు, చౌటుప్పల్

